# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ సోమవారం 14 జూలై 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 351

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## విలక్షణ నటనకు రాచ బాట.. కోట

2లో



2లో


## ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై తెలంగాణ జాగృతి కార్యకర్తల దాడి

### క్యూ న్యూస్ కార్యాలయంలో ఫర్నిచర్, కిటికీలు ధ్వంసం

### మల్లన్న సహా పలువురికి స్వల్పగాయాలు

### పోలీసుల అదుపులో నలుగురు

ఎమ్మెల్సీ కవితను ఉద్దేశించి ఇటీవల జహీరాబాద్‌లో నిర్వహించిన బీసీ నేతల సమావేశంలో తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ జాగృతి కార్యకర్తలు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మేడిపల్లిలోని క్యూ న్యూస్ కార్యాలయం పైకి వచ్చారు.



## ఘనంగా లష్కర్ బోనాలు

2లో



### ఉజ్జయినీ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్

రాష్ట్రంలో మంచి వర్షాలు కురిసి పాడిపంటలతో రైతులంతా సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అమ్మవారికి బోనం సమర్పించారు.



# కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంచిర్యాల జిల్లాలో సౌర విద్యుత్తు ప్లాంటు పనుల ప్రారంభం

లక్షెట్టిపేట: ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని దశల వారీగా పూర్తిస్థాయిలో అమలు చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం రెబ్బెనపల్లి గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో రూ.3 కోట్లతో ఏర్పాటు చేయనున్న 1 మెగావాట్ సామర్థ్యం కలిగిన సౌర విద్యుత్తు ప్లాంటు పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే లక్ష్యంతో తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కుల, మతాలకు అతీతంగా పేదింటి పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో ఉచిత విద్య అభ్యసించేందుకు వీలుగా రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టామన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లిలో పూరించిన శంఖారావం, నిర్వహించిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రల ద్వారానే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి బీజాలు పడిన విషయాన్ని తమ ప్రభుత్వం ఎప్పటికీ మరిచిపోదన్నారు. అంతకు ముందు లక్షెట్టిపేటలో రూ.11.53 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రి భవనాన్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖలతో కలిసి ఆయన ప్రారంభించారు.

అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. మంచిర్యాల నగరపాలక సంస్థ పరిధిలోని వేంపల్లిలో ఇండస్ట్రియల్, ఐటీ పార్కు భూమి పూజలో పాల్గొన్నారు.

## ఏ పార్టీలోనూ చేరను.. నా కండువా మారదు



తాడేపల్లి, 'నేను ఏ పార్టీలోనూ చేరను. నా కండువా మారదు. భవిష్యత్తులోనూ ప్రజల కోసం నా పోరాటం ఆగదు' అని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. 'పద్మశ్రీ' పురస్కారం పొందిన నేపథ్యంలో మంద కృష్ణమాదిగ దంపతులను ఆదివారం గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఏపీ ఎస్సీ, ఎస్టీ, గెజిటెడ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సమావేశానికి ఆ సంఘం అధ్యక్షుడు కేవీ రమణ అధ్యక్షత వహించారు. మంద కృష్ణ మాట్లాడుతూ 'రాజకీయాల్లో చేరితే వ్యక్తిగతంగా బాగుపడతాను.. కానీ ఉద్యమం చేస్తే జాతిని గెలిపించి భవిష్యత్తును ఇవ్వవచ్చు. పలు రాజకీయ పక్షాలు ఎంపీ, రాజ్యసభ సీట్లు ఇస్తామన్నాయి. తీసుకుంటే నేడు మాజీగా మిగిలిపోయేవాడిని. ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు సాధించడం భవిష్యత్తు కార్యాచరణలో భాగంగా పెట్టుకున్నా' అని పేర్కొన్నారు.

## పైలట్ల పాత్రపై అప్పుడే నిర్ధారణకు రాలేం



ముంబయి: అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమాన ప్రమాదంమీద వచ్చిన ప్రాథమిక దర్యాప్తు నివేదికతోనే పైలట్ల పాత్రపై నిర్ధారణకు రావడం తొందరపాటే అవుతుందని విమాన ప్రమాద దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) మాజీ అధిపతి అరబిందో హాండా అభిప్రాయపడ్డారు. తుది నివేదిక మాత్రమే కచ్చితమైన కారణాన్ని వెల్లడించగలదని స్పష్టం చేశారు. దర్యాప్తును పారదర్శకంగా, పక్షపాతం లేకుండా పూర్తి చేయడానికి ఏఏఐబీని అనుమతించాలని పేర్కొన్నారు. ఏఏఐబీలో ఉన్నప్పుడు 100కుపైగా విమాన ప్రమాదాలపై దర్యాప్తును నిర్వహించిన హాండా.. ఆదివారం అహ్మదాబాద్ విమాన ప్రమాద ప్రాథమిక నివేదికపై స్పందించారు. 'ఇప్పటిదాకా ఏఏఐబీ బాగా పని చేసింది. దర్యాప్తు కొనసాగాలి. ఇక నుంచీ దర్యాప్తు అధికారులు ఎందుకు.. ఎలా ఇంధన స్విచ్‌లు మారాయనే అంశంపై దృష్టి సారిస్తారు. మెకానికల్, ఎలక్ట్రికల్ వైఫల్యాలేమైనా చోటుచేసుకున్నాయా అని విచారణ జరుపుతారు' అని వివరించారు. 'కొంత మంది.. ప్రత్యేకించి విదేశీ మీడియావారు పైలట్లలో ఒకరు తప్పు చేసి ఉండవచ్చని అభిప్రాయపడుతున్నారు. అటువంటి ఊహాగానాలకు మన సీనియర్ విమానయాన రంగ నిపుణులు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నా' అని పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో కల్లుపై నిషేధం?

- కల్తీ కల్లు ఘటన నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ ఆలోచన
- సీఎం రేవంత్‌తో చర్చించాలని మంత్రి జూపల్లి నిర్ణయం
- నగరంలో స్వచ్ఛమైన కల్లు 10 శాతమే.. 90 శాతం కల్తీనే..
- 10 గ్రాముల ఆల్ఫాజోలంతో 100 పెట్టెల కల్లు తయారీ

హైదరాబాద్: కల్తీ కల్లుతో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్న నేపథ్యంలో హైదరాబాద్‌లో కల్లు విక్రయాలను పూర్తిగా నిషేధించాలని ఎక్సైజ్ శాఖ ఆలోచిస్తోంది. నిషేధం విధించడానికి ముందు సంబంధిత వర్గాలన్నింటితో సంప్రదింపులు జరపాలని భావిస్తోంది. కల్లుపై నిషేధం రాజకీయపరమైన సమస్యలతో ముడిపడి ఉన్న నేపథ్యంలో జాగ్రత్తగా డీల్ చేయాలని యోచిస్తోంది. నగరంలోని కల్లు సొసైటీల్లో ఉన్నవారికి ప్రత్యామ్నాయ ఉపాధి ఎలా కల్పించాలన్న దానిపై సమాలోచన చేస్తున్నట్లు సమాచారం. కల్లుపై నిషేధం గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించాలని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. హైదరాబాద్ నగరంలో విక్రయిస్తున్న కల్లులో 90 శాతం కృత్రిమంగా తయారుచేసినదే ఉంటోందని అధికారవర్గాలు చెబుతున్నాయి. చెట్ల నుంచి సహజంగా తీసిన కల్లు 10 శాతమేనని అంటున్నారు. హైదరాబాద్‌లో మొత్తం 97 కల్లు సొసైటీలు ఉన్నాయి. ఒక్కో సొసైటీ పరిధిలో రోజూ 10 నుంచి 20 పెట్టెల (ఒక్కో పెట్టెలో 10 %-% 12 సీసాలు) కల్లు



విక్రయాలు జరుగుతుంటాయని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. ఇందులో 90 శాతం ఆల్ప్రాజోలం వంటి రసాయనాలతో తయారుచేసినదే ఉంటోందని సమాచారం. ఈ ఆల్ప్రాజోలం ఎక్కువగా మహారాష్ట్ర నుంచి వస్తున్నట్లు చెబుతున్నారు. ఒక కిలో ఆల్ప్రాజోలం ధర దాదాపు రూ.15 లక్షల వరకు ఉంటుంది.

# ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై తెలంగాణ జాగృతి కార్యకర్తల దాడి





హైదరాబాద్:ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు చెందిన క్యూ న్యూస్ కార్యాలయం వద్ద తెలంగాణ జాగృతి కార్యకర్తలు ఆదివారం చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎమ్మెల్సీ కవితను ఉద్దేశించి ఇటీవల జహీరాబాద్‌లో నిర్వహించిన బీసీ నేతల సమావేశంలో తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ జాగృతి కార్యకర్తలు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మేడిపల్లిలోని క్యూ న్యూస్ కార్యాలయం పైకి వచ్చారు. సిబ్బందిని తోసివేసి ఫర్నిచర్, కిటికీలు ధ్వంసం చేశారు. ఈ సమయంలో మల్లన్న తన ఛాంబర్లోనే ఉండగా.. తలుపులు పగులగొట్టి లోపలికెళ్లి దాడి చేశారు. ఈ క్రమంలో ఆయన కుడిచేతికి స్వల్ప గాయమైంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో గన్‌మేన్ శ్రీనివాస్ తన తుపాకీతో ఆరు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారు. విషయం తెలుసుకొని మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ ఆర్.గోవిందరెడ్డి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకోగా అప్పటికే ఆందోళనకారులు కొందరు పరారయ్యారు. జాగృతి కార్యకర్త సాయి చేతికి అద్దం గుచ్చుకుని గాయమవగా ఆసుపత్రికి తీసుకెళ్లారు. జాగృతి యాదాద్రి జిల్లా అధ్యక్షుడు సందుపట్ల సుజిత్‌రావు, ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షుడు అశోక్‌యాదవ్‌తోపాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మల్లన్నకు ఘట్‌కేసర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించారు. 'నాపై దాడి చేయడమే కాకుండా.. నా గన్‌మేన్ చేతిలోని తుపాకీ లాక్కొని నన్ను కాల్చేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన మరో గన్‌మేన్ గాల్లోకి కాల్పులు జరిపారు. ఎమ్మెల్సీ కవిత తన ఉనికి కోసం బీసీ నాయకత్వం మీద దాడి చేస్తే ఊరుకోం' అని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ఇరువర్గాల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో కవిత, మల్లన్నలపై కేసులు నమోదైనట్లు మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి ఒక ప్రకటనలో తెలిపారు.

**మల్లన్న ఛాంబర్‌లోకి రావొద్దని హెచ్చరిస్తూ తుపాకీ ఎక్కుపెట్టిన ఆయన గన్‌మేన్ శ్రీనివాస్**

మల్లన్న ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని సస్పెండ్ చేయాలి

తీన్మార్ మల్లన్న ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని సస్పెండ్ చేయాలని కోరుతూ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. మల్లన్నపై హత్యాయత్నం కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరుతూ డీజీపీ కార్యాలయంలో అదనపు ఐజీ(శాంతిభద్రతలు) రమణకుమార్‌కూ ఫిర్యాదు చేశారు. 'ఈ ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలి. లేదంటే ఆయనే మల్లన్నతో



# ఘనంగా లష్కర్ బోనాలు

**ఉజ్జయినీ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్**

హైదరాబాద్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి అమ్మవారి బోనాల ఉత్సవం ఆదివారం ఘనంగా సాగింది. అమ్మవారి జాతరతో లష్కర్ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉదయం 11.40 గంటలకు ఆలయానికి చేరుకోగా.. అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ముఖ్యమంత్రికి వేద మంత్రాలతో ఆశీర్వచనాలు అందించారు. సీఎం వెంట మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ రాగా ముఖ్యమంత్రి ఆయనను ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. వేకువజామున 4.10 గంటలకు హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సతీ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు, తొలిబోనం సమర్పించారు. రాష్ట్రంలో మంచి వర్షాలు కురిసి పాడిపంటలతో రైతులంతా సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అమ్మవారికి బోనం సమర్పించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మంత్రి సీతక్క, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, పద్మారావు, దానం నాగేందర్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం బోనాల సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ బంజారాహిల్స్‌లోని అధికారిక నివాసంలో ఇచ్చిన విందుకు సీఎం రేవంత్‌రెడ్డి, శాసనసభాపతి గడ్డం ప్రసాద్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు హాజరయ్యారు.

## నేడు రేషన్‌కార్డుల పంపిణీ

**తిరుమలగిరిలో ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి**



నల్లగొండ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం సూర్యాపేట జిల్లాకు రానున్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి మండల కేంద్రంలో సాయంత్రం 4 గంటలకు బహిరంగసభ నిర్వహించనున్నారు. సభలో ఆయన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. అధికారులు రాష్ట్రవ్యాప్తంగా 5,61,343 మందికి కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నారు. వాటిద్వారా 45,34,430 మందికి లబ్ధి చేకూరనుంది. రాష్ట్రంలో గతంలో 89,95,282 కార్డుల ద్వారా 2,81,47,565 మందికి లబ్ధి చేకూరగా, ఇకపై 95,56,625 రేషన్ కార్డుల ద్వారా 3,09,30,911 మందికి లబ్ధి చేకూరనుంది. సీఎం వెంట జిల్లా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు సభలో పాల్గొననున్నారు.

# 15 న టీఎన్జీవో ఆధ్వర్యంలో "బోనాల ఉత్సవాలు".




ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్ వెల్లడి.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జులై 13:**

ప్రతి సంవత్సరం ఆషాఢమాసంలో తెలంగాణ నాన్ గెజిటెడ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే బోనాల ఉత్సవాలు ఈ నెల 15న నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్ అన్నారు. టిఎన్జీవో జిల్లా కార్యాలయం నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాశెట్టి సుమన్ కుమార్ మాట్లాడు తూ... టీఎన్జీవో ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం మాదిరిగా పాత కలెక్టర్ కార్యాలయ ఆవరణలో గల నవ దుర్గ మాత ఆలయ ప్రాంగణంలో ఆషాడ బోనాల ఉత్సవాలు మంగళవారం ఉ. 11 గం.లకు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా అధికారులు, ఉద్యోగులు, ముఖ్యంగా మహిళా ఉద్యోగ సోదరిమణులు, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు,టీఎన్జీవో అన్ని యూనిట్ శాఖల అధ్యక్ష కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, అన్ని శాఖల ఫోరం అధ్యక్ష కార్యదర్శులు, క్లాస్ ఫోర్ డ్రైవర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యవర్గ బృందం, రిటైర్డ్ ఉద్యోగులు,పెన్షనర్స్ అసోసియేషన్ అధిక సంఖ్యలో హాజరై, బోనాల ఉత్సవ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఈ విలేఖరుల సమావేశంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతి కుంట శేఖర్, జిల్లా సహాధ్యక్షులు చిట్టి నారాయణ రెడ్డి, టీఎన్జీవో కేంద్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, జిల్లా కోశాధికారి దినేష్ బాబు, జిల్లా సంయుక్త కార్యదర్శి జాఫర్ హుస్సేన్, నిజామాబాద్ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, మారుతి తదితరులు ఉన్నారు

# విలక్షణ నటనకు రాచ బాట.. కోట




కోట శ్రీనివాసరావు – ఈ పేరు వినిపిస్తే చాలు... భాష మురిసిపోతుంది. యాస పరవశిస్తుంది. హావభావాలు ఆహా.. అంటూ దాసోహమవుతాయి. మేనరిజమ్ అంతెత్తు కోట ఎక్కి కూర్చుంటుంది. ఇక నన్నెవరూ అందుకోలేరనే గర్వంతో! మొత్తంగా ఆయా పాత్రలు... హోమ్ గ్రౌండ్‌లో ఆటలా ఒకొక్కటిగా చెలరేగిపోతాయి! కళ్లప్పగించి చూడటమే మన పని! రంగస్థల వేదికైనా... వెండితెర అయినా... తన నటనతో ప్రతి పాత్రనీ పరిపూర్ణం చేసిన దిగ్గజం కోట శ్రీనివాసరావు.ఒక్కో నటుడి పేరు చెబితే ఒక్కో తరహా పాత్రలు గుర్తుకొస్తాయి. కానీ కోట శ్రీనివాసరావుని మాత్రం అలా ఒక పాత్రకే పరిమితం చేయలేం. నవ్విస్తూనే, కంటతడి పెట్టించిన నటుడాయన. విలన్‌గా టెన్షన్ పెడుతూనే, మరోవైపు తన మార్క్ మేనరిజమ్‌తోనూ, మాట విరుపుతోనూ నవ్వించిన అరుదైన ప్రతిభ ఆయనది. ఇక తండ్రి, తాత, బాబాయ్ తరహా పాత్రలైతే తన కోసమే పుట్టాయన్నట్టుగా అందులో ఒదిగిపోయారు. తెరపైన విలన్ ఎంత బలంగా కనిపిస్తే, హీరోయిజం అంత గొప్పగా పండుతుంది! ఆ లెక్కన ఎన్నో సినిమాల్లో హీరోయిజాన్ని పండించిన ఘనత కోట శ్రీనివాసరావుది! అన్ని రకాల పాత్రలపై గొప్పగా ప్రభావం చూపించి ఆల్‌రౌండర్ అనిపించుకున్న అరుదైన నటుడాయన. ఎస్వీఆర్, రావు గోపాలరావు, కైకాల తర్వాత తెలుగు సినిమా విలనిజానికి, సహ పాత్రలకీ ఇక దిక్కెవరో అన్న సందేహం తలెత్తినప్పుడు నేనున్నా అంటూ మెరిసిన నట శిఖరం కోట శ్రీనివాసరావు.

# ఘనంగా "ఊర పండుగ"





**సర్వ సమాజ్ వారి ఆధ్వర్యంలో సంబరాలు.**

**పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ, ప్రముఖులు.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జులై 13**

: సర్వ సమాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఊర పండుగ, అమ్మవార్ల విగ్రహాల ఊరేగింపు నగరంలో ఘనంగా నిర్వహించారు. ఖిల్లా నుండి ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "గత 90 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఇందూర్ ఊర పండుగకు ఎంతో ఘనమైన చరిత్ర ఉందన్నారు. గతంలో, ప్రజలు గత్తర, మచూచి వంటి వ్యాధులతో బాధపడినప్పుడు, అమ్మవార్లను శాంతింపచేయడానికి ఈ ఊర పండుగ నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతుంది" అని పేర్కొన్నారు.

అంతేకాకుండా "ఇది కులాల మధ్య తేడా లేకుండా, అన్ని వర్గాల ప్రజలు కలిసిగట్టుగా నిర్వహించడం హిందువుల ఐక్యతకు నిదర్శనం అన్నారు. భవిష్యత్తులో కూడా ఈ ఐక్యమత్యాన్నికొనసాగిస్తూ,హిందువులందరు మన పండుగలను ఘనంగా నిర్వహించుకోవాలని అని సూచించారు. ఆషాడ మాసంలో వచ్చే ఈ పండుగ రైతులకు అనుకూల వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండేల అమ్మ ఆశీర్వాదం ఇందూర్ ప్రజలందరిపై ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు.



## అన్నమయ్య జిల్లాలో లారీ బోల్తా.. తొమ్మిది మంది దుర్మరణం

పుల్లంపేట:అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం రెడ్డిచెరువు కట్టపై ఆదివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకొంది. మామిడికాయల లోడుతో వెళ్తున్న లారీ బోల్తాపడటంతో తొమ్మిది మంది కూలీలు మృతిచెందగా.. మరో 12 మంది గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలివి... రాజంపేట మండలం ఇసుకపల్లి గ్రామ పరిసరాల్లోని తోటల నుంచి మామిడికాయలు కోయడానికి రైల్వేకోడూరు మండలం శెట్టిగుంట ఎస్టీ కాలనీ, తిరుపతి జిల్లా వెంకటగిరి మండలం వద్దివేడు, కల్వకుంట్ల ప్రాంతాలకు చెందిన 21 మంది కూలీలు ఆదివారం వచ్చారు. మామిడికాయల లోడుతో రైల్వేకోడూరు మార్కెట్‌కు వెళ్తున్న లారీపై వీరంతా కూర్చున్నారు. లారీ పుల్లంపేట మండలం రెడ్డిచెరువు కట్టపై అదుపుతప్పి బోల్తా పడడంతో కూలీలంతా లోడు కిందపడ్డారు.కూలీలను పనికి తీసుకెళ్లిన మేస్త్రీ శివ ఒక్కరే చిన్న గాయాలతో బయటపడగా అతని భార్య చిట్టెమ్మ(25)తో పాటు సుబ్బరత్నమ్మ(45), గజ్జల దుర్గయ్య(32), గజ్జల శ్రీను(33), గజ్జల లక్ష్మీదేవి(36), రాధ(39), గజ్జల రమణ(42), వెంకట సుబ్బమ్మ(37) ఘటనా స్థలంలోనే దుర్మరణం పాలయ్యారు. వద్దివేడు గ్రామానికి చెందిన మునిచంద్ర(38)ను రాజంపేట ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయారు.

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

# రాసి పెట్టుకోండి.. వచ్చే మూడేళ్లలో..



తెలంగాణ: జాగృతి కార్యకర్తల దాడితో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కవిత, ఆమె కుటుంబమే తనను చంపించడానికి కుట్ర పన్నారని ఆరోపించారు. బీసీ ఉద్యమాన్ని ఆపాలని చూస్తే పొరపాటేనని హెచ్చరించారు. తన కార్యాలయంపై జరిగిన దాడిలో కవిత అనుచరులు గన్‌మెన్ నుండి తుపాకీ లాక్కొని కాల్పులకు ప్రయత్నించారని మండిపడ్డారు. కవిత ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయంగా మిమ్మల్ని పాతాళానికి తొక్కేస్తానని శపథం చేశారు.



తన కార్యాలయంపై జాగృతి కార్యకర్తలు దాడి చేయడంతో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తీవ్రంగా స్పందించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కవిత, ఆమె కుటుంబం తనను చంపడానికి ప్రయత్నించారని ఆరోపించారు. ఇలాంటి దాడులతో బీసీ ఉద్యమం ఆగిపోతుందని అనుకుంటే పొరపాటేనని మల్లన్న అన్నారు. ఉదయం 11.30 గంటల సమయంలో 30 మంది తన కార్యాలయంపై దాడి చేశారని మల్లన్న చెప్పారు. తన గన్‌మెన్లు ఆపడానికి ప్రయత్నించినా తోసుకుంటూ లోపలికి వచ్చారని తెలిపారు. కవిత అనుచరుల దాడిలో తన చేతికి గాయమైందని చెప్పారు. తన గన్‌మెన్ నుంచి తుపాకీ లాక్కొని కాల్పులు జరిపేందుకు ప్రయత్నించారని మల్లన్న ఆరోపణలు చేశారు. ఈ తరహా దాడులు చేసినంత మాత్రాన బీసీలు, అణగారిన వర్గాల కోసం చేసే ప్రయత్నాలు ఆగవని మల్లన్న స్పష్టం చేశారు. మరింత ఉత్సాహంతో ముందుకెళ్తామని ఆయన అన్నారు. ఇలాంటి వాటికి తాను భయపడనని ఆయన తేల్చి చెప్పారు. 'రాసి పెట్టుకోండి.. రానున్న మూడేళ్లలో మిమ్మల్ని రాజకీయంగా పాతాళానికి తొక్కే బాధ్యత మాది" అని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. బీసీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో తాము పోరాడుతున్నామని మల్లన్న తెలిపారు. ప్రభుత్వం తమ సలహాలను స్వీకరిస్తోందని, పొరపాట్లు జరిగితే సరిచేసుకుంటోందని ఆయన అన్నారు. ఈ విషయంలో కవితకు ఎందుకు బాధ కలుగుతుందో అర్థం కావడం లేదని మల్లన్న ప్రశ్నించారు.

రాజకీయ ఉనికి కోసం అయితే కేసీఆర్‌ను అడగాలని ఆయన సూచించారు. ఎమ్మెల్సీ కవితకు తండ్రి కేసీఆర్, అన్న కేటీఆర్‌పై ఉన్న కోపం.. తమపై చూపిస్తే కుదరదని మల్లన్న అన్నారు. 10 ఏళ్ల పాటు తెలంగాణ రాష్ట్రాన్ని మీ కుటుంబం దోచుకుందని మల్లన్న ఆరోపించారు. ఇలాంటి దాడులతో మరింత దిగజారి ప్రజల్లో చులకన కావడం తప్ప ఇంకేమీ ఉండదని ఆయన అన్నారు. సహచర ఎమ్మెల్సీపై దాడులకు ప్రేరేపించిన కవిత ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని మల్లన్న డిమాండ్ చేశారు. 'మా కార్యాలయంలో పడిన రక్తపు మరకల సాక్షిగా ప్రజాక్షేత్రంలోకి వెళ్తాం' అని ఆయన అన్నారు. కాగా, జాగృతి కార్యకర్తలను అదుపుచేయడానికి మల్లన్న గన్‌మెన్ గాల్లోకి కాల్పులు జరిపారు. ఈ సమయంలో ఓ బుల్లెట్ జాగృతి కార్యకర్త భుజం మీదుగా దూసుకెళ్లడంతో అతడికి గాయమైంది.

# భారీగా తగ్గిన సన్న బియ్యం ధరలు..

తెలంగాణ: సన్నబియ్యం ధరలు భారీగా తగ్గాయి. సన్నవడ్లకు రేవంత్ సర్కార్ బోనస్ ప్రకటించటం, రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ, మూడు నెలలకు ఒకేసారి రేషన్ ఇవ్వంట కారణంగా ప్రస్తుతం మార్కెట్‌లో సన్నబియ్యం ధరలు తగ్గాయి. గతంలో రూ. 5 వేలకు పైగా ఉన్న క్వింటా ధరలు.. ప్రస్తుతం రూ. 4 వేలకు పడిపోయాయి. దీంతో మధ్యతరగతి ప్రజలకు ఆనందం వ్యక్తం చేస్తుండగా.. వ్యాపారులు గిరాకీ లేక ఆవేదన చెందుతున్నారు.

తెలంగాణలో సన్న బియ్యం ధరలు భారీగా తగ్గాయి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రేట్లు అమాతం దిగి వచ్చాయి. గతంలో క్వింటా రూ. 5-6 వేల మధ్య పలికిన ధరలు, ప్రస్తుతం భారీగా తగ్గాయి. క్వింటా సన్నబియ్యం రూ.4- 4,500 వేల మధ్య దొరుకుతున్నాయి. సన్న వడ్లకు సర్కార్ బోనస్ ప్రకటించటం, రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం, మూడు నెలల రేషన్ కింద సన్న బియ్యం ఒకేసారి పంపిణీ చేయడంతో మార్కెట్‌లో బియ్యం ధరలు గణనీయంగా తగ్గాయి.

రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్ సన్న వడ్లపై రూ.500 బోనస్ ప్రకటించడంతో సన్న వడ్ల సాగు విస్తీర్ణం దాదాపు రెట్టింపు అయింది. దీంతో ధాన్యం దిగుబడి భారీగా పెరిగి, సప్లై కూడా పెరిగింది. ఇది ధరలపై ప్రభావం చూపింది. రాష్ట్రవ్యాప్తంగా 2.60 కోట్ల మంది రేషన్ లబ్ధిదారులకు 17,349 రేషన్ షాపుల ద్వారా గత నెలలో మూడు నెలలకు సంబంధించి 4.73 లక్షల టన్నుల సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ భారీ పంపిణీ కారణంగా బహిరంగ మార్కెట్‌లో సన్న బియ్యం డిమాండ్ గణనీయంగా తగ్గింది.

దానికి తోడు తమిళనాడు, మహారాష్ట్ర వంటి పొరుగు రాష్ట్రాల నుండి సన్న బియ్యం ఆర్డర్లు తగ్గడం కూడా ధరల పతనానికి మరో కారణమని వ్యాపారులు చెబుతున్నారు.కాగా, జూన్ నుంచి క్రమంగా బియ్యం ధఱలు తగ్గుతున్నాయి. జూలై మొదటి వారంలో మరింత పడిపోయాయి. గత ఏడాది క్వింటాల్ రూ.5,600 ఉన్న హెచ్‌ఎంటీ రకం బియ్యం ధర ఇప్పుడు రూ.4,600కు తగ్గింది. కర్నూల్ మసూరి రకం రూ.4,000కు చేరుకోగా, జై శ్రీరాం రకం రూ.5,800 నుంచి రూ.4,600కు పడిపోయింది. ఆర్ఎన్ఆర్, సాంబా రకాల ధరలు కూడా క్వింటాల్ రూ.1,000 వరకు తగ్గాయి.

తగ్గిన ధరలు మధ్యతరగతి వినియోగదారులకు ఎంతో ఊరట కలిగిస్తున్నాయి. రేషన్ కార్డులు లేని సుమారు 30 లక్షల కుటుంబాలకు, నెలకు 60 వేల టన్నుల బియ్యం అవసరం ఉండగా.. వారికి ఈ ధరల తగ్గుదల లాభదాయకంగా మారింది. అయితే, బహిరంగ మార్కెట్‌లోని బియ్యం వ్యాపారులకు గిరాకీ 20 శాతానికి పైగా పడిపోయింది. హైదరాబాద్ నగరంలోని రైస్ షాపుల్లో రోజువారీ కొనుగోళ్లు భారీగా తగ్గాయని, కొన్ని ప్రాంతాల్లో బోనీ కూడా లేదని వ్యాపారులు వాపోతున్నారు. గతంలో నెలకు 250 క్వింటాళ్ల బియ్యం అమ్మిన షాపులు ఇప్పుడు 100 క్వింటాళ్లు కూడా అమ్మలేని పరిస్థితి నెలకొందని రామంతపూర్‌కు చెందిన ఓ హోల్‌సేల్ వ్యాపారి ఆందోళన వ్యక్తం చేశారు.

# మహిళలకు అకౌంట్లోకి డబ్బులు..!



తెలంగాణ: మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. మహిళా స్వయం సహాయక సంఘాల ఖాతాల్లోకి వడ్డీ రాయితీ డబ్బులు జమ చేయనుంది. ఇందుకోసం రూ.344 కోట్లు విడుదల చేసింది.అంతేకాకుండా, మహిళా సంఘాల సభ్యులకు రుణ, ప్రమాద బీమా పథకాలను కూడా ప్రభుత్వం అమలు చేస్తోంది. రానున్న ఐదేళ్లలో లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రంలోని మహిళలకు తెలంగాణ సర్కారు శుభవార్త వినిపించింది. మహిళా స్వయం సహాయక సంఘాలు ఖాతాలలో వడ్డీ రాయితీ డబ్బులు జమ చేస్తోంది. ఇందుకోసం రూ.344 కోట్ల రూపాయలను తెలంగాణ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది. ఈ నిధులను జిల్లాల వారీగా బ్యాంకులకు విడుదల చేసింది. ఈ 344 కోట్ల రూపాయల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఉండే మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.300 కోట్లు, పట్టణాలలో ఉండే స్వయం సహాయక సంఘాల కోసం రూ.44 కోట్లు కేటాయించారు. వడ్డీ రాయితీ నిధులను గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్త ద్వారా పంపిణీ చేస్తారు. అయితే ఈ వడ్డీ రాయితీ డబ్బులు మహిళా స్వయం సహాయక సంఘాల ఖాతాల్లోకి జూలై 18లోపు జమ కానున్నట్లు తెలిసింది.

డబ్బులు జమయ్యే లోపే తెలంగాణ ప్రభుత్వం ప్రజాప్రతినిధుల ద్వారా మండలాలు, గ్రామాలలో ఇందిరా మహిళా శక్తి పేరుతో కార్యక్రమాలు నిర్వహించి చెక్కులను పంపిణీ చేస్తోంది. జూలై 12 నుంచి ఈ కార్యక్రమాలు మొదలయ్యాయి. వడ్డీ రాయితీ డబ్బులకు సంబంధించిన చెక్కులను నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు స్వయం సహాయక సంఘాలలోని మహిళలకు పంపిణీ చేయనున్నారు. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం వడ్డీ రాయితీ చెక్కులతో పాటుగా, స్వయం సహాయక సంఘాలలోని మహిళల కోసం అమలు చేస్తున్న రుణ బీమా. ఇన్సూరెన్స్ బీమా చెక్కులు కూడా ఇందిరా మహిళాశక్తి కార్యక్రమంలో పంపిణీ చేస్తారు. రుణ బీమా కింద రుణం తీసుకున్న మహిళ చనిపోతే ఆ మహిళ తీసుకున్న రుణం మాఫీ చేస్తారు. అలాగే ప్రమాద బీమా సౌకర్యం ద్వారా స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా ఉండే మహిళలు అనుకోకుండా ప్రమాదవశాత్తూ చనిపోతే.. వారి కుటుంబానికి రూ.10 లక్షలు అందిస్తారు.

వీటి ద్వారా తెలంగాణ మహిళలకు ఆర్థిక స్వావలంబన, సాధికారత కోసం కృషి చేయాలని తెలంగాణ సర్కారు భావిస్తోంది. అలాగే మహిళకు జీవనోపాధి కల్పిస్తుందని అధికారులు చెప్తున్నారు. ఇందుకోసం వచ్చే ఐదేళ్లలో మహిళా స్వయం సహాయక సంఘాలకు లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలను అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. స్త్రీ నిధి ద్వారా మహిళా సంఘాలలోని సభ్యులకు ప్రమాద బీమా పొడిగించారు. దీనివలన రాష్ట్రంలోని 63.86 లక్షల మంది మహిళలకు రూ.10 లక్షల వరకు బీమా సౌకర్యం కల్పిస్తుంది. దీని ద్వారా 29,680 మహిళలకు ఉపాధి లభిస్తోంది. సౌకర్యాన్ని కల్పించింది.

# పాశమైలారంలో మరో అగ్ని ప్రమాదం..



సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని పారిశ్రామిక వాడలో మరోసారి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఎన్వీరో వేస్ట్ మేనేజ్ మెంట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో ఇవాళ ఉదయం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. భారీగా అగ్నికీలలు ఎగసిపడటంతో దట్టమైన పొగ ఆ ప్రాంతమంతా కమ్ముకుంది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు. మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో సమీప ఫైర్ స్టేషన్ల నుంచి అదనపు అగ్నిమాపక వాహనాలను కూడా రప్పించారు. ఈ పరిశ్రమలో వ్యర్థాల నిర్వహణ జరుగుతుంది. కాబట్టి, రసాయనాలు లేదా ఇతర మండే స్వభావం గల పదార్థాలు ఉండటం వల్ల మంటలు వేగంగా వ్యాప్తి చెంది ఉండవచ్చని ప్రాథమిక అంచనా. ప్రస్తుతం మంటలు భారీగా ఎగసిపడుతున్న దృశ్యాలు ఆందోళన కలిగిస్తున్నాయి. భారీ ఆస్తి నష్టం సంభవించి ఉంటుందని ఫైర్ సిబ్బంది భావిస్తున్నారు.

ఇక పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో జూన్ 30న భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. రియాక్టర్ పేలుడు ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ దుర్ఘటనలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతూ విషాదాన్ని నింపింది. ఇప్పటి వరకు 44 మంది కార్మికులు ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో బీహార్, ఒడిశా, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఉన్నారు. మరో 8 మంది మృతదేహాలు పూర్తిగా కాలిపోవడం వల్ల, మరికొన్ని శరీర భాగాలుగా లభించడంతో డీఎన్ఏ పరీక్షల ద్వారా గుర్తిస్తున్నారు. పేలుడు ధాటికి కొందరు కార్మికులు 100 మీటర్ల దూరం వరకు ఎగిరిపడ్డారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ప్రమాదంలో 60 మందికి పైగా కార్మికులు గాయపడ్డారు. వారిలో పలువురు తీవ్రమైన కాలిన గాయాలతో నగరంలోని వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. కొందరి పరిస్థితి ఇంకా విషమంగానే ఉంది. ప్రమాదం జరిగిన సమయంలో పరిశ్రమలో 140 మందికి పైగా కార్మికులు ఉన్నట్లు సమాచారం. పరిశ్రమలో సరైన అగ్ని భద్రతా చర్యలు లేవని, భద్రతా నిబంధనలను ఉల్లంఘించారని నివేదికలు చెబుతున్నాయి. పాత మిషనరీలను ఉపయోగించడం కూడా ప్రమాదానికి ఆరోపణలు ఉన్నాయి. ఇలా సిగాచీ అగ్ని ప్రమాదం మరిచిపోకముందే తాజాగా మరో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది.

# తెలంగాణను ఏపీలో కలిపే కుట్ర..

తెలంగాణను తిరిగి ఆంధ్రప్రదేశ్‌లో కలిపే కుట్ర జరుగుతోందని కవి నందిని సిధారెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఏపీ సీఎం చంద్రబాబు, ఆయనకు మద్దతు ఇచ్చే పత్రికలు, నాయకులు ఈ కుట్రలో భాగమని ఆయన ధ్వజమెత్తారు. మౌనంగా ఉంటే తెలంగాణ చిహ్నాలు మాయమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కలకు, రాజకీయానికి ప్రాంతం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు ఈ కుట్రలపై అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ను తిరిగి ఆంధ్రప్రదేశ్‌గా మార్చే కుట్ర జరుగుతోందని.. ఏపీ సీఎం చంద్రబాబు నాయకత్వంలోని పత్రికలు, నాయకులు ఈ దిశగా పావులు కదుపుతున్నారని ప్రముఖ కవి, రచయిత నందిని సిధారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఒక పత్రిక రాసిన వ్యాసంలో బీఆర్ఎస్ పార్టీని విమర్శిస్తున్నట్లు రాతలు కనిపించినప్పటికీ.. లోపల తెలంగాణ అస్తిత్వాన్ని అస్థిరపరిచే రాతలు రాశారని.. 'ఇప్పుడిప్పుడే తెలంగాణ, ఆంధ్ర అనే భావన లేకుండా అందరూ సంతోషంగా ఉన్నారంటూ' ఆ వ్యాసంలో పేర్కొన్నారని ఆయన ధ్వజమెత్తారు. తెలంగాణ, ఆంధ్ర భావన లేకుండా సంతోషంగా ఉన్నది కేవలం సదరు వార్తా పత్రిక యజమాని, సీఎం రేవంత్ రెడ్డి, ఆయన గురువు చంద్రబాబు మాత్రమేనని నందిని సిధారెడ్డి విమర్శించారు. ప్రభుత్వం వచ్చిన కొత్తలో 'ఎందుకు మాట్లాడాలి?' అని మౌనంగా ఉంటే.. తెలంగాణ చిహ్నంలో కాకతీయ తోరణం మాయమైందని.. తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మ మాయమైందని.. అంతేకాకుండా భారతదేశ చిత్రపటంలో తెలంగాణనే తీసేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం అనంతరం నటి జయసుధ 'కలకు ప్రాంతం ఉండదు' అని వ్యాఖ్యానిం చడాన్ని కూడా నందిని సిధారెడ్డి ఖండించారు. కలకు ప్రాంతం ఉంటుందని.. రాజకీయానికి కూడా ప్రాంతం ఉంటుందని చెప్పారు. ఈ పరిణామాలు అనుకోకుండా జరుగుతున్నవి కావని.. చాలా పక్కా ఆలోచనలతో, కుట్రపూరితంగా చేస్తున్నవేనని సిద్ధారెడ్డి ఆరోపించారు.

# హౌసింగ్ బోర్డు ప్లాట్ల వేలానికి నోటిఫికేషన్ రిలీజ్..

రంగారెడ్డి: జిల్లాలో హౌసింగ్ బోర్డు ప్లాట్ల వేలానికి సిద్ధమైంది. కుర్మల్‌గూడ, బహదూర్‌పల్లి, తొర్రూరులలో 189 ప్లాట్లను ఆగస్టులో వేలం వేయనున్నారు. చందానగర్‌లో 3 కమర్షియల్ ప్లాట్లకు టెండర్లు పిలిచారు. కుర్మల్‌గూడలో గజం 20 వేలు, తొర్రూరులో 25 వేలు, బహదూర్‌పల్లిలో 27 వేలుగా ధర నిర్ణయించారు. ఇదిలా ఉండగా, నల్గొండలో ఇటీవల వేలం వేసిన ప్లాట్లు భారీగా అమ్ముడుపోయాయి. అధికారులు మాత్రం తక్కువ ధరకే ప్లాటు కొనుగోలు చేసే అవకావం ఉందని అంటున్నారు.

తెలంగాణలోని ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ప్లాట్ల వేలానికి హౌసింగ్ బోర్డు నోటిఫికేషన్ రిలీజ్ చేసింది. కుర్మల్‌గూడ, బహదూర్‌పల్లి, తొర్రూరులో ఉన్న 189 వివాదరహిత ప్లాట్లకు వేలం వేయాలని అధికారులు భావిస్తున్నారు. వచ్చే నెల అనగా ఆగస్టులో ఈ 189 ప్లాట్లకు వేలం వేసేందుకు హౌసింగ్ బోర్డు అధికారులు రెడీ అవుతున్నారు. వీటితో పాటుగా చందానగర్‌లో ఉన్న మరో 3 కమర్షియల్ ప్లాట్లను వేలం వేయాలని భావించిన అధికారులు.. వచ్చే నెలలో ప్లాట్ల వేలానికి టెండర్లను పిలిచింది.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఉన్న 189 ప్లాట్ల వేలానికి నోటిషికేషన్ విడుదల చేసిన హౌసింగ్ బోర్డు అధికారులు.. వచ్చే నెల అనగా ఆగస్టు 4న కుర్మల్ గూడలో, 5వ తేదీన బహదూర్‌పల్లిలో.. ఆగస్టు 6న తొర్రూరులో వేలం వేయనున్నారు. ఆతర్వాత చందానగర్‌లో ఆగస్టు 20న ప్లాట్ల వేలం వేయనున్నట్లు హౌజింగ్ బోర్డు ఎండీ వెల్లడించిన నోటిఫికేషన్‌లో చెప్పుకొచ్చారు.

ఇక చందానగర్ ప్లాట్ల వేలానికి సంబంధించి ఒక్కో ప్లాట్ కు రూ.10 లక్షల డిపాజిట్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అధికారులు తెలిపారు. ఈ ప్లాట్లకు సంబంధించి ఒక్క గజం ధరను రూ.40 వేలుగా ఖరారు చేశారు. అలానే కుర్మల్‌గూడలో గజం రూ.20 వేలు, తొర్రూరులో గజం రూ.25 వేలుగా అధికారులు ఖరారు చేశారు. బహదూర్‌పల్లిలో ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు రూ.3 లక్షలు కట్టాలని, ఈ ప్లాట్లకు సంబంధించి గజం రూ.27 వేలుగా నిర్ణయించామని ఎండీ తెలిపారు.



ఇదిలా ఉంటే ఐదు రోజుల క్రితం నల్గొండ - దేవరకొండ రహదారిపై ఉన్న హౌసింగ్ బోర్డు కాలనీలోని హెచ్ఐజీ ,ఎంఐజీ ప్లాట్లను వేలం వేసిన సంగతి తెలిసిందే. ఇక గత మంగళవారం జరిగిన వేలం పాటలో.. ఊహించని రీతిలో ఈ ప్లాట్లు హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. మొత్తం 27 ప్లాట్ల వేలానికి నోటిఫికేషన్ జారీ చేయగా.. వాటిల్లో 21 ప్లాట్లు కొనుగోలుదారులను ఆకర్షించాయి. ఈ విక్రయాల ద్వారా హౌసింగ్ బోర్డుకు ఏకంగా రూ.8.97 కోట్లు ఆదాయం సమకూరినట్లు తెలిసింది.. వేలంలో ప్రతి ప్లాటు దాని కనీస ధర కంటే అధిక ధరకే విక్రయించడం విశేషం.

# మిస్సైన ఆర్మీ జవాన్... శ్రీశైలం డ్యామ్ సమీపంలో

మహబూబాబాద్: ఆర్మీ జవాన్ భార్య అనారోగ్యం పాలవడంతో అతడికి సెలవు దొరకలేదు. అయినా ఊరికి వచ్చి ఆమెకు శస్త్రచికిత్స చేయించాడు. విధులకు తిరిగి వెళ్తూ అతడ బంధువుకు ఫోన్ చేసి తన గురించి వెతకొద్దని చెప్పి అదృశ్యమయ్యాడు. రెండు రోజుల కింద ఇది జరిగింది. శ్రీశైలం డ్యామ్ దగ్గర అతని కారు, ఫోన్ కనిపించడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. సెలవు ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడా అనే అనుమానాలు ఉన్నాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని గాలిస్తున్నారు.

ఆర్మీ జవాన్ .. తన భార్య అనారోగ్యానికి గురికావడంతో సెలవు కోసం దరఖాస్తు చేశాడు. అయితే, ఉన్నతాధికారులు అతడి దరఖాస్తును తిరస్కరించినా.. ఊరికి వచ్చి ఆమెకు సర్జరీ చేయించాడు. అనంతరం డ్యూటీకి వెళు _న్నానని చెప్పి బయలుదేరాడు. తర్వాత తన బంధువుకు ఫోన్ చేసి తనకోసం వెతకొద్దని, పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోమని చెప్పి.. ఫోన్ కట్ చేశాడు.



అప్పటి నుంచి అతడి ఆచూకీ తెలియకుండాపోయింది. దీంతో కుటుంబం తీవ్ర ఆందోళనకు గురైన అతడి కోసం గాలిస్తోంది. చివరికి అతడి కారు, మొబైల్ ఫోన్ శ్రీశైలం డ్యామ్ సమీపంలో గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని గిరిపురం గ్రామానికి చెందిన నవీన్ ఆర్మీలో జవాన్‌గా పనిచేస్తున్నాడు. అతడు రోజులుగా కనిపించడం లేదు. డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి వెళ్ళిన నవీన్, శ్రీశైలం వైపు కారులో వెళ్ళినట్లు సమాచారం.

ఆయన భార్యకు అనారోగ్యం కారణంగా నవీన్ సెలవు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. కానీ ఉన్నతాధికారులు సెలవు ఇవ్వలేదు. అయినా నవీన్ ఊరికి వచ్చి, భార్యకు శస్త్ర చికిత్స చేయించాడు. ఆ తరువాత హైదరాబాద్ నుంచి తిరిగి వస్తూ, డ్యూటీకి వెళ్లకుండా శ్రీశైలం వైపు వెళ్ళాడు. శ్రీశైలం డ్యాం దగ్గర నుంచి నవీన్ తన బంధువుకు ఫోన్ చేసి.. "నా కోసం వెతకవద్దు. పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోండి' అని చెప్పాడు. ఆ తరువాత డ్యాం దగ్గర కారులో పురుగుల మందు సీసా, మొబైల్ ఫోన్ వదిలి వెళ్ళిపోయాడు.

నవీన్ కనిపించకుండా పోవడంతో, ఆయన బంధువులు ఈగలపెంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని, నవీన్ కోసం వెతుకుతున్నారు. ఈ ఘటన గిరిపురం గ్రామంలో విషాదాన్ని నింపింది. సెలవు దొరక్కపోవడంతో, మనస్తాపానికి గురై ఉంటాడని భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, గాలింపు చర్యలు చేపట్టారు. నవీన్ ఏమయ్యాడు? అతడు ఆత్మహత్యకు పాల్పడ్డాడా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఈ సంఘటన ఆర్మీలో పనిచేసే ఉద్యోగుల ఒత్తిడి గురించి చర్చకు దారితీసింది. విధుల్లో ఎదురయ్యే మానసిక ఒత్తిడిపై దృష్టి పెట్టాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# రూ.60 లక్షల ప్యాకేజీతో జాక్‌పాట్ కొట్టిన కుర్రాడు

ఖమ్మం: జిల్లాకు చెందిన షేక్ సోహెల్ అనే 20 ఏళ్ల కుర్రాడు తన తెలివితేటలతో అద్భుతం సృష్టించాడు. జేఎన్‌టీయూలో బీటెక్ (ఏఐఎంఎల్) చదువుతున్న అతనికి ఓ సాఫ్ట్‌వేర్ సంస్థ ఏకంగా రూ. 2 లక్షల ఉపకారవేతనంతో పాటు రూ. 60 లక్షల వేతన ప్యాకేజీని ఆఫర్ చేసింది. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, తల్లి ప్రోత్సాహంతో సోహెల్ ఈ ఘనత సాధించాడు. ఇంతకీ ఆఫర్ ఇచ్చిన కంపెనీ ఏంటి? సోహెల్ ఎలా సాధించాడు?

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ)లో బీటెక్ చివరి ఏడాది చదువుతోన్న విద్యార్థి జాక్ పాట్ కొట్టాడు. అతడికి రూ.60 లక్షల ప్యాకేజీతో అద్భుతమైన ఆఫర్ వచ్చింది. ఓ సాఫ్ట్‌వేర్ సంస్థ అతడికి నెలకు రూ.2 లక్షల ఉపకార వేతనంతో పాటు, అదనంగా రూ.60 లక్షల వేతన ప్యాకేజీని ఆఫర్ చేసింది. నిరుపేద కుటుంబానికి చెందిన ఆ యువకుడు తన ప్రతిభతో ఈ ఘనత సాధించాడు. వివరాల్లోకి వెళ్తే.. ప్రఖ్యాత సాఫ్ట్‌వేర్ అండ్ ఫైనాన్షియల్ ట్రేడింగ్ కంపెనీ 'డీఈ షా' క్యాంపస్ ఇంటర్వ్యూ నిర్వహించింది. ఒక్క ఉద్యోగం కోసం కంప్యూటర్ సైన్స్, ఏఐఎంఎల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగాల నుంచి దాదాపు 200 మంది విద్యార్థులు పోటీ పడ్డారు. అనేక పరీక్షల తరువాత, ఖమ్మంకి చెందిన విద్యార్థి షేక్ సోహెల్ ఫైనల్ ఇంటర్వ్యూలో విజేతగా నిలిచాడు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ( ఐఐటీ)ల్లో చదివే విద్యార్థులకే కంపెనీలు అధిక ప్యాకేజీలు ఆఫర్లు చేస్తున్న సంగతి తెలిసిందే.

తనకు ఎంత పరిజ్ఞానం ఉందనే దానికంటే, సమస్యను పరిష్కరించిన విధానం డీఈ షా కంపెనీ ప్రతినిధులను ఆకట్టుకుందని సోహెల్ తెలిపాడు. 'ఇచ్చిన 30 నిమిషాల్లోనే అన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పి, అందరికన్నా ఎక్కువ మార్కులు తెచ్చుకున్నాను' అని సోహెల్ చెప్పాడు. ఉన్నత చదువులతో మంచి ఉద్యోగం సాధించాలనే తన కలకు రెక్కలు ఇచ్చి.. ఎగిరేలా స్ఫూర్తినిచ్చింది హైదరాబాదే అని సోహెల్ ఆనందం వ్యక్తం చేశాడు. ఖమ్మం జిల్లాకు చెందిన సోహెల్.. ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న కుటుంబం నుంచి వచ్చాడు. ఆరేళ్ల క్రితం తన తండ్రి బడేమియా అనారోగ్యంతో చనిపోయాడని.. అప్పటి నుంచి తల్లి చాన్‌బాను అన్నీ తానై చూసుకుందని చెప్పాడు. తన విజయానికి ఆమె మద్దతు ఎంతో ఉందని సోహెల్ తెలిపాడు. సోహెల్ ప్రస్తుతం బీటెక్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్) చివరి ఏడాది చదువుతున్నాడు. భారీ ప్యాకేజీతో ఉద్యోగం పొందిన సోహెల్‌కు జేఎన్టీయూ ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. ఐఐటీ బాంబే విద్యార్థులకు భారీ ప్యాకేజీతో ఉద్యోగాలు లభిస్తుంటాయి.

కాగా, గతేడాది కూడా జేఎన్‌టీయూకు చెందిన విద్యార్థినికి డీఈ షా రూ.52 లక్షల ప్యాకేజీ ఆఫర్ చేసింది. గత ఫిబ్రవరిలో ఒక్క ఉద్యోగం కోసం డీఈ షా క్యాంపస్ ఇంటర్వ్యూ నిర్వహించగా.. వంద మందికిపైగా హాజరయ్యారు. వీరిలో చల్లా సాయికృతి అనే అమ్మాయిని గోల్డెన్ ఆఫర్ వరించింది. మూడు రౌండ్ల అనంతరం సాయికృతిని ఎంపిక చేశారు. కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన ఆమె.. అక్క స్ఫూర్తితో సాఫ్ట్‌వేర్ రంగంలోకి వెళ్లాలని నిర్ణయించుకుంది.

# మానవ వనరుల వినియోగంలో వైఫల్యం !

జనాభా పెరుగుదల అన్నది అభివృద్ధికి సూచిక కానేకాదు. జనాభా వల్ల వనరులు తగ్గుతాయి. ఆర్థిక భారం పడుతుంది. భారత్ లాంటి ప్రజాస్వామ్య దేశంలో జనాభా వల్ల ఖజానాపై అత్యధిక భారం పడుతుంది. ఎందుకంటే వీరందరికి పెన్షన్లు ఇవ్వాలి.కిలోరూపాయి బియ్యం పథకం అమలు చేయాలి. ఇంట్లో ఎందరు ఉంటే అంతమందికి బియ్యం ఇవ్వాలి. ఎందరుంటే అంతమందికి పెన్షన్లు ఇవ్వాలి. వీరుమాత్రం దర్జాగా ప్రభుత్వ పథకాలతో కాలక్షేపం చేస్తూ బలాదూర్‌గా తిరుగుతున్నారు. ఇప్పటికే ఏ రంగంలోనయినా కూలీల కొరత తీవ్రంగా ఉంది. జనాభా ఉన్నాకూలీలు దొరకని దేశం ఒక్క భారత్ మాత్రమే అయివుంటుంది.

జనాభాను ఉపయోగించి వస్తూత్పత్తి చేసి, ఎగుమతులు చేయడం ద్వారా పటిష్ట ఆర్థిక విధానాలు అమలు చేసే ప్రణాళికలు భారత దేశంలోని ప్రభుత్వాల వద్ద లేవు. చైనాలాంటి దేశాలు అధిక జనాభాను కూడా ఆర్థిక ఉత్పత్తికి కేంద్రాలుగా ఉపయోగించుకుంటున్నాయి. ప్రజలందరికి పని కల్పించి, వారితో వస్తూత్పత్తిని ప్రోత్సహిస్తున్నారు. దాంతో విదేశాలకు ఎగుమతులు పెంచి ఆర్థికంగా బలపడుతున్నారు. కానీ భారత్‌లో అది సాధ్యం కావడం లేదు. ఇప్పటికే వ్యవసాయానికి కూలీలు దొరకడం లేదు. పనులు చేసేందుకు ఎవ్వరూ ముందుకురావడంలేదు. పనిచేయకున్నా పస్తులుండే పరిస్థితులు లేవు. ఎందుకంటే ప్రభుత్వం ఏదోరకంగా ఏదో ఒక పథకంతో ఆదుకుంటోంది. లేదా రాజకీయ పార్టీల జెండాలు మోస్తే వారే మందు, బిర్యానీలు సరఫరా చేస్తుంటారు. ఇలా మానవవనరులను వృధా చేసుకుంటున్న ఏకైక దేశం భారత్ మాత్రమేనని చెప్పడంలో వెనకాడాల్సిన పనిలేదు. దీనికంతటికీ ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలే కారణం. ఉచిత పథకాలతో ప్రజలను సోమరులుగా తయారు చేస్తున్నారు. అందువల్ల వారు పనిచయడానికి ఇష్టపడడం లేదు. ప్రభుత్వ పథకాలు ఏవేవి వస్తున్నాయో లెక్కలు కట్టి మరీ రాబట్టు కుంటున్నారు. దీంతో వారు కాయకష్టం చేయడానికి ఇష్టపడడం లేదు. భారతదేశంలో 140 కోట్ల జనాభా ఉన్నా ప్రతిరంగంలోనూ కార్మికుల కొరత ఉంది. అందరూ వైట్ కాలర్జాబ్‌లే చేయాలనుకుంటున్నారు. స్వయం ఉపాధి రంగాలపై శ్రద్ధ చూపడం లేదు. ఆయా రంగాలకు రుణాలు ఇచ్చి ప్రోత్సహించేలా ప్రభుత్వ విధానాలు ఉండడం లేదు. ఉదాహరణకు కోళ్ల పెంపకానికి డిమాండ్ ఉంది. అలాగే పాడిపరిశ్రమకునిత్యం డిమాండ్ ఉంది. గొర్రెలు, చేపల పెంపకానికి కూడా డిమాండం ఉంది. ఈ రంగాల్లో స్వయం సమృద్ధితో ఉపాధి పొందవచ్చు. కానీ యువత అందుకు సిద్దంగా లేదు. ఈ క్రమంలో జనాభా పెరగాలని రష్యా లాంటి దేశాలు ఆరాటపడు తున్నాయి. భారత్ లాంటి దేశాలు వద్దు బాబోయం అంటున్నాయి. కొన్ని దేశాలు ఇప్పటికే అధిక జనాభాతో సతమతమవుతూ..జనాభా నియంత్రణ చర్యలు పాటిస్తున్నాయి. మరికొన్ని దేశాలు జనాభా పెరుగుదలకు ప్రోత్సాహకాలు ఇస్తున్నాయి. గతంలో జనాభా నియంత్రణను కఠినంగా అమలు చేసిన దేశాలు కూడా ఇప్పుడు ఆ నిబంధనను సడలిస్తున్నాయి. భారతదేశంలోని కొన్ని రాష్ట్రాల పరిస్థితులు కూడా ఇలాగే ఉన్నాయి. జనాభా పెరగాలని ఎపి సిఎం చంద్రబాబు లాంటి వారు కోరుకుంటున్నారు. యూపీ, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ లాంటి రాష్ట్రాలు ఇప్పటికీ జనాభా నియంత్రణకు ప్రాధాన్యమిస్తుండగా, దక్షిణాదికి చెందిన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ వంటి రాష్ట్రాలు జనాభా పెరుగుదలను ప్రోత్సహించే దిశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో జనాభా అనేది ప్రధాన సమస్య కాదని, ప్రభుత్వాల వద్ద సరైన ప్రణాళికలు లేకపోవడమే అసలు కారణమని తెలుస్తున్నది. జనాభా పెరగాలంటున్న చంద్రబాబు లాంటి వారివద్ద సరైన ప్రణాళికలు లేవు. ఉన్న జనాభాను ఎలా వినియోగిం చుకోవాలో తెలియదు. ఇప్పటికే ఖజానా భారంగా మారినా ఊరూరా పెన్షన్ల పంపిణీని జాతరలా కొనసాగి స్తున్నారు. ఇదంతా

కేవలం రాజకీయ ప్రయోజనాలు ఆశించి చేస్తున్నదే తప్ప మరోటి కాదు. సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకొని, సరైన ప్రణాళికలతో జనాభాను వినియోగించుకుంటే దేశంలో అద్భుత ఫలితాలు సాధించవచ్చు. వస్తూత్పత్తని పెంచవచ్చు. వ్యవసాయక దేశమైన భారత్‌లో తిండిగింజలను పండించవచ్చు. వనరులను ఉపయోగించుకుని వ్యవసాయంలో ఆర్థిక విప్లవం తీసుకుని రావచ్చు. కానీ ఇలా ఆలోచన చేసే నేతలు దేశంలో లేరు. 140 కోట్ల జనాభాతో ప్రపంచంలో భారతదేశం మొదటి స్థానంలో ఉండగా, చైనా రెండో స్థానంలో ఉన్నది. జనాభా పెరుగుదల సమస్యలు దేశాల ఆర్థిక, సామాజిక, పర్యావరణంపై ఆధారపడి ఉంటాయి. సరైన ప్రణాళిక లేనప్పుడు జనాభా పెరుగుదల ఒత్తిడిని సృష్టిస్తుంది. వనరులను దెబ్బతీస్తుంది. పర్యావరణ విధ్వంసానికి కారణం అవుతుంది. అయితే సమర్థవంత మైన విధానాలతో ఈ సవాళ్లను అధిగమించవచ్చు. జనాభాను ఉపయోగించుకోవడం అన్నది నేతల సమర్థతకు పరీక్ష లాంటిది. అధిక జనాభా ఉన్నా కొన్ని దేశాలు సరైన ప్రణాళికలతో అభివృద్ధిపథంలో దూసుకు పోతున్నాయి. అందుకు చైనా మన కళ్లముందు కనిపిస్తున్న ఉదాహరణ. అధిక జనసాంద్రత ఉన్నప్పటికీ సింగపూర్ సమర్థవంతమైన ప్రణాళిక ద్వారా ఆర్థిక, సామాజిక అభివృద్ధిని సాధించింది. ప్రపంచంలో జనసాంద్రత పరంగా సింగపూర్ మూడో స్థానంలో ఉంది. ఈ దేశ వైశాల్యం 719.9 చదరపు కిలోమీటర్లు కాగా, చదరపు కిలోమీటర్‌కు 8,595 మంది నివసిస్తున్నారు. అధిక ఆర్థిక వృద్ధి, అత్యుత్తమ గృహనిర్మాణం, ఆరోగ్య సేవలతో ప్రపంచంలోనే ఈ దేశం అగ్రగామిగా ఉంది. జనసాంద్రత పరంగా చైనా ప్రపంచవ్యాప్తంగా 83వ స్థానంలో ఉంది. 1980 నుంచి 2015 వరకు చైనా వన్ చైల్డ్ పాలసీని అమలు చేసి, దాదాపు 40 కోట్ల జనాభాను నియంత్రించింది. ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చిన ఆ దేశం జనాభా వనరులను సమర్థవంతం గా ఉపయోగించింది. ఫలితంగా చైనా రెండో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదిగింది. ప్రపంచంలోని ఇతర దేశాలతో పోల్చుకుంటే భారతదేశంలో 35 ఏళ్లలోపు యువ జనాభా 65 శాతం ఉంది. ఈ జనాభాను పనివిధానంలోకి మారిస్తే అద్భుతాలు సాధించవచ్చు. ఇది సరైన ప్రణాళికతో ఆర్థిక వృద్ధికి దోహదపడు తుంది. ఎగుమతి ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా యువ జనాభాను ఉత్పాదక శక్తిగా మార్చవచ్చు. అయితే ఇప్పటి వరకు ఏ రాష్ట్రం లేదా కేంద్రం ఇలాంటి ఆలోచనలు చేయలేదు. ప్రజాస్వామ్యంలో ఓటు ప్రధానం కనుక అటువైపే ప్రణాళికలు ఉంటున్నాయి.




# రష్యా నుంచి చమురు దిగుమతులు

**ఓ రకంగా ప్రపంచ ఆర్థికానికి మేలు జరిగింది**

**కేంద్ర పెట్రోలియ శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి**

న్యూఢిల్లీ:రష్యా నుంచి చమురు కొనడం ద్వారా భారత్ ప్రపంచానికి మేలు చేసిందని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి తెలిపారు. ఓరకంగా భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మేలు చేసిందని అన్నారు. లేదంటే అంతర్జాతీయ మార్కెట్లో ధరలు ఆకాశన్నంటేవని తెలిపారు. ఉక్రెయిన్‌పై యుద్ధం సాగిస్తున్న రష్యాపై పశ్చిమ దేశాలు ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ మాస్కో నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడంపై అప్పట్లో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీనిపై భారత్ ఎప్పటికప్పుడు స్పష్టతనిస్తూనే ఉంది. తాజాగా కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి దీనిపై మరోసారి స్పందించారు.

రష్యా చమురును ఎన్నడూ ఆంక్షల పరిధిలోకి తీసుకురాలేదు. కేవలం దాని ధరపై మాత్రమే పరిమితి విధించారు. ప్రపంచ చమురు సరఫరా గొలుసు ఎలా ఉంటుందన్న వాస్తవం చాలామందికి తెలుసు. రష్యా నుంచి డిస్కౌంట్లో వచ్చిన చమురును భారత్ కొనుగోలు చేయడం వల్ల ప్రపంచ మార్కెట్లకు మేలే జరిగింది. లేదంటే చమురు ధరల మోత మోగేదని పురి అన్నారు. సాధారణంగా రష్యా రోజుకు 9 మిలియన్ బ్యారెళ్ల చమురును ఉత్పత్తి చేస్తోంది. ప్రపంచంలోని అతిపెద్ద ముడిచమురు ఉత్పత్తిదారుల్లో మాస్కో ఒకటి. ఇక, ప్రపంచవ్యాప్తంగా రోజుకు 97 మిలియన్ బ్యారెళ్ల చమురు సరఫరా అవుతోంది. ఆంక్షల కారణంగా ఇందులో 9 మిలియన్ బ్యారెళ్ల సరఫరా ఒక్కసారిగా ఆగిపోతే.. ప్రపంచ వినియోగంలో 10శాతం తగ్గించు కోవాల్సి వస్తుంది. అది అసాధ్యం. అప్పుడు సరఫరా తగ్గడంతో బ్యారెల్ చమురు ధర 120-130 డాలర్లకు పెరిగేదని కేంద్రమంత్రి వివరించారు. ఎనర్జీ మార్కెట్‌ను అర్థం చేసుకోలేనివారే ఇలాంటి అంశాలపై మాట్లాడతారని ఆయన దుయ్యబట్టారు.

# కొత్త పుంతలు తొక్కుతున్న ఆవిష్కరణలు

**జపాన్‌లో అద్భుత ఇంటర్నెట్ ఆవిష్కరణ**




టోక్యో: ఆవిష్కరణలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఎప్పుడు ఎలాంటి ఆవిష్కరణలు వస్తాయో చెప్పలేని పరిస్థితి. ఎఐతో ప్రపంచం అంతా మారిందనుకుంటున్న వేళ అన్నింటా అద్భుతాలు ఆవిష్కృతం అవుతున్నాయి. బుల్లెట్ రైళ్లు, అత్యుత్తమ ఎయిర్‌పోర్టులు చూస్తున్నాం. రోబోలతో మొత్తం ప్రపంచ గతి మారుతోంది. వైద్యరంగంలోనూ ఆవిష్కరణలుకొత్త పుంతలు తొక్కిస్తున్నాయి. ఈ క్రమంలో అధునాతన సదుపాయాల్లో ముందుండే జపాన్ ఇప్పుడు మరో అద్భుతాన్ని ఆవిష్కరించింది. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన ఇంటర్నెట్‌ను ఆ దేశ పరిశోధకులు అభివృద్ధి చేశారు. సెకనకు 1.02 పెటాబిట్స్ స్పీడ్‌తో పనిచేసే ఈ ఇంటర్నెట్‌తో.. కేవలం రెప్పపాటులో నెట్‌ఫ్లిక్స్ లైబ్రరీలో ఉన్న డేటా మొత్తాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని నిరూపించారు. అమెరికాలో ఉన్న సగటు ఇంటర్నెట్ కనెక్షన్ల కంటే ఇది 3.5 మిలియన్ రెట్ల వేగవంతమైనదని అంటున్నారు. ప్రత్యేక ఫైబర్ ఆప్టిక్ కేబుల్ సాయంతో జపాన్ ఈ వేగవంతమైన నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసింది. ఇందుకోసం పరిశోధకులు ట్రాన్స్‌మిటర్లు, రిసీవర్లు, 19 లూపింగ్ సర్క్యూట్లను వినియోగించారు. ఈ లూపింగ్ సర్క్యూట్ ఒక్కోటి 86.1 కిలోమీటర్ల పొడవు ఉంది. ఈ లూప్స్ నుంచి సిగ్నళ్లు వెళ్లి డేటాను అందిస్తాయి. దీని సాయంతోనే సెకనుకు 1808 కిలోమీటర్ల దూరం వరకు డేటాను పంపించేందుకు వీలు లభిస్తుందని తెలిపింది. ప్రస్తుతానికి ఈ ఇంటర్నెట్ గృహ వినియోగదారులకు అందుబాటులోకి వచ్చే అవకాశాలు కన్పించట్లేదు. ప్రభుత్వాలు, డేటా సెంటర్ ఆపరేటర్లు, టెలికాం సంస్థలు దీన్ని వినియోగించు కునేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 6జీ నెట్‌వర్క్, తర్వాతితరం సముద్రగర్భ కేబుళ్లకు ఈ జపాన్ ఇంటర్నెట్ ఓ మోడల్‌గా నిలవనుంది.

జపాన్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ తమ వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఇక భారత్‌లోని సగటు ఇంటర్నెట్ స్పీడ్‌తో పోలిస్తే దీని బ్రౌజింగ్, డౌన్‌లోడింగ్ వేగం 16 మిలియన్ రెట్లు ఎక్కువని తెలిపింది. ఎన్ఐసీటీలోని ఫొటోనిక్ నెట్‌వర్క్ లాబోరేటరీ టీమ్, సుమితోమో ఎలక్ట్రిక్ అండ్ యూరోపియన్ పార్ట్‌నర్స్‌తో కలిసి జపాన్ ఈ ఇంటర్నెట్‌ను అభివృద్ధి చేసింది. ఈ ఇంటర్నెట్‌తో కేవలం ఒక్క సెకనులోనే ఇంగ్లీష్ వికీపిడియా మొత్తాన్ని 10వేల సార్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆ వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. సాధారణంగా ఈ వికీపిడియా స్టోరేజీ 100 జీబీ వరకు ఉంటు-ంది. ఇక, కొత్త ఇంటర్నెట్‌తో ఒక్క సెకనులోనే 8కే రిజల్యూషన్‌తో ఉన్న వీడియోలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని జపాన్ పరిశోధకులు చెబుతున్నారు.

# మరోమారు కాళేశ్వరం కమిషన్ ముందుకు హరీష్ రావు

**కేబినేట్ నిర్ణయాలు..అసెంబ్లీ ఆమోదించిన వివరాలు అందచేత**

**కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తప్పులతడక**

**విమర్శలు గుప్పించిన మాజీమంత్రి**

హైదరాబాద్: కాళేశ్వరం కమిషన్ చీఫ్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ ముందు విచారణకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు శుక్రవారం హాజరయ్యారు. బీఆర్‌కే భవన్‌లో మరోసారి పీసీ ఘోష్ కమిషన్‌ను హరీష్‌రావు కలిశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై మరింత అదనపు సమాచారాన్ని ఇచ్చారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లపై ఆరుసార్లు కేబినెట్ ఆమోదం పొందిందని గుర్తుచేశారు మాజీ మంత్రి హరీష్‌రావు. అసెంబ్లీలో కూడా మూడుసార్లు ఆమోదించారని మాజీ మంత్రి హరీష్‌రావు తెలిపారు. ఈ వివరాలన్నీ డాక్యుమెంట్లతో సహా కమిషన్‌కు ఇచ్చానని చెప్పుకొచ్చారు. మిగిలిన వివరాలు రేవంత్ ప్రభుత్వం దగ్గరే ఉన్నాయని వివరించారు. కమిషన్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి సమాచారం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినవన్నీ అసత్యాలేనని ఆరోపించారు. 50 ఏళ్లుగా కాంగ్రెస్‌వి అబద్ధాలు, మోసాలేనని విమర్శించారు. కృష్ణా జలాల్లో 299 టీ-ఎంసీల కేటాయింపు కాంగ్రెస్ పాపమేనని మండిపడ్డారు. సెక్షన్ 3 కింద నీళ్ల పంపిణీ చేయాలని అప్పుడే అడిగారని హరీశ్‌రావు గుర్తుచేశారు. ప్రజా భవన్‌లో కాళేశ్వరంపై ఇచ్చింది పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కాదు...కవర్ పాయింట్ ప్రజెంటేషన్ అని మాజీ మంత్రి హరీష్‌రావు ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అజ్ఞానం, అహంకారం బయటపెట్టుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ 50 ఏళ్లు చేసిన ద్రోహాన్ని కప్పిపుచ్చుకోవడానికి కవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారని దెప్పిపొడిచారు. 299 టీ-ఎంసీల పేరుతో శాశత్వ ఒప్పందమని సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి ఆనాడే 299 టీ-ఎంసీలకి ఉమ్మడి రాష్ట్రంలో ఒప్పందం చేశారని గుర్తుచేశారు. శాశ్వత ఒప్పందం కేసీఆర్ చేసి ఉంటే...సెక్షన్ 3 కోసం పోరాటం ఎందుకు చేస్తారని నిలదీశారు. సెక్షన్-3 విషయంలో ఉమా భారతి, గడ్కరీనీ కలిశారని చెప్పుకొచ్చారు మాజీ మంత్రి హరీష్‌రావు. కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేసి సెక్షన్-3ని కేసీఆర్ సాధించారని మాజీ మంత్రి హరీష్‌రావు ఉద్ఘాటించారు. బోర్డు తాత్కాలిక నీటి వినియోగం కోసం ఒప్పందం చేస్తుందని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి సైతం 299 టీఎంసీలకు సంతకాలు చేశారని మరి మీరు ఎలా చేశారని ప్రశ్నించారు. కృష్ణా నదిలో తెలంగాణ వాటాను రేవంత్ ప్రభుత్వం సాధించాలని కోరారు. రేవంత్ రెడ్డి అజ్ఞానంతో మాట్లాడారని.. తాను చాలా బాధతో చెబుతున్నానని అన్నారు. కృష్ణానదిని దోచుకో అని రేవంత్ రెడ్డి చంద్రబాబుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి అజ్ఞానాన్ని తాను బయటపెట్టిన తర్వాత ఆయన మాట మార్చారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఎలాగూ తెలియదు... ఉత్తమ్ కుమార్ రెడ్డికి కూడా తెలీదు అంటే బాధేస్తోందని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు చెప్పినట్లు- కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందా అని ప్రశ్నించారు. 573 టీ-ఎంసీలు చాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పడం అజ్ఞానమని విమర్శించారు మాజీ మంత్రి హరీష్‌రావు. 00 ఏళ్ల కింద కాకతీయులు, నిజాం కాలంలో కట్టిన ప్రాజెక్టలని రేవంత్‌రెడ్డి ఖాతాలో వేసుకున్నారు. దేశానికి స్వాతంత్రం రాకముందు కట్టిన ప్రాజెక్టలను కూడా ఆయన ఖాతాలో వేసుకున్నారు. కాంగ్రెస్ 6లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తే...బీఆర్ఎస్ పాలనలో 48 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చాం. తుమ్మడిహెట్టి నుంచి బ్యారేజ్ మార్పుపై సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రప్రభుత్వాన్ని తప్పుబడుతున్నారు. కేంద్రం ఎందుకు అనుమతి ఇచ్చిందో ప్రశ్నించండి. 160 టీ-ఎంసీలకు కేంద్రం నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అనుమతి తేలేదు?. అసెంబ్లీలో చర్చకు మేము సిద్ధం. మా మైక్ కట్ చేయకుండా, అసెంబ్లీ నుంచి పారిపోవద్దు. రేవంత్ 20 నెలల పాలనలో ఇప్పుడు ఒక్క చెరువు, చెక్ డ్యామ్ అయినా కట్టించారా.?. కేసీఆర్ ప్రభుత్వం ఏం చేయనిది నీళ్లు ఎలా వచ్చాయి.. పంటలు ఎలా పండాయి. కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లను వాడటం లేదు... 6శాతం నీళ్లను తక్కువగా వాడారని హరీష్‌రావు విమర్శించారు.

# ఇంధన సరఫరా స్విచ్‌లో ఆఫ్ అయ్యాయా

**ఎయిరిండియా ప్రమాదంపై వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం**



వాషింగ్టన్: ఎయిర్ ఇండియా విమానం ఏఐ-171 ప్రమాదంలో ఇంధన సరఫరా స్విచ్‌లను ఆఫ్ చేసినట్లు సందేహాలను వ్యక్తంచేస్తూ అమెరికా పత్రిక వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం పేర్కొంది.

విమానం గాల్లోకి ఎగిరే సమయంలో స్విచ్‌లు సాధారణంగానే ఉన్నట్లు వాల్‌స్ట్రీట్ చెబుతోంది. అవి ఎలా ఆఫ్ అవుతాయనే విషయాన్ని నిపుణులు స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. వీటిని ఉద్దేశపూర్వకంగా ఆపారా..? తిరిగి ఆన్ చేయడానికి ప్రయత్నించారా అనే అంశాన్ని వారు స్పష్టంగా చెప్పలేకపోతున్నారని వెల్లడించింది. స్విచ్‌లు ఆఫ్ అయితే మాత్రం ర్యాట్ ఎందుకు యాక్టివేట్ అయిందో చెప్పే అవకాశం ఉంది.

అమెరికా అధికారుల అంచనాలను ఉటంకిస్తూ ఈ విషయాన్ని వెల్లడించింది. విమానంలోని జీఈ సంస్థకు చెందిన రెండు జెట్ ఇంజిన్లు సక్రమంగానే పనిచేస్తున్నట్లు పేర్కొంది. ఇంధనం సరఫరా చేసే స్విచ్‌లు ఆఫ్ అయి ఉంటాయని అమెరికా నిపుణులు అభిప్రాయపడుతున్నట్లు- పేర్కొంది. దీంతో టేకాఫ్ అయిన వెంటనే హఠాత్తుగా విమానం థ్రస్ట్‌ను కోల్పోయి ఉండొచ్చని పేర్కొంది. సాధారణంగా విమానం ఇంజిన్లను స్టార్ట్ చేయడం లేదా షట్‌డౌన్ చేయడానికి, కొన్ని అత్యవసర సందర్భాల్లో రీసెట్ కోసం వాడుతుంటారు.

మరోవైపు భారత్‌కు చెందిన ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రస్తుతం దీనిపై దర్యాప్తు చేస్తోంది. ప్రాథమిక నివేదిక అతిత్వరలో విడుదల కావచ్చన్న అంచనాలు ఉన్నాయి. అమెరికా నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్ ప్రస్తుతం భారత దర్యాప్తునకు సహకారం అందిస్తోంది. అయితే, భారత ప్రభుత్వం ఇతర దేశాలకు డేటాను షేర్ చేయడంలో అభిప్రాయబేధాలున్నట్లు- వాల్‌స్ట్రీట్ చెబుతోంది. ఈ ప్రమాదంపై అమెరికా అధికారులు ఆ పత్రికతో మాట్లాడుతూ విమానం మోడల్, లేదా జీఈ ఇంజిన్లతో దుర్ఘటనకు సంబంధం లేదని దర్యాప్తు సూచిస్తున్నట్లు వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు ఎఫ్ఏఏ లేదా బోయింగ్, జీఈలు ఎటువంటి సర్వీస్ బులెటిన్‌ను విడుదల చేయలేదన్నారు. మరోవైపు వైమానిక రంగానికి చెందిన పత్రిక 'ది ఎయిర్ కరెంట్' కూడా ఈ ప్రమాద దర్యాప్తు మొత్తం ఇంధన కంట్రోల్ స్విచ్‌ల చుట్టూనే తిరిగినట్లు పేర్కొంది. దర్యాప్తు ముందుకుసాగే కొద్దీ చేరే కొత్త సమాచారంతో ఈ అంచనాలు, అభిప్రాయాలు మారుతుంటాయని వెల్లడించింది. ఈ ప్రమాదంపై ఇప్పటివరకు జరిపిన విశ్లేషణ, దర్యాప్తు ఆధారంగా ఏఏఐబీ ప్రాథమిక నివేదిక రూపొందించింది. దాన్ని కేంద్ర పౌరవిమాన మంత్రిత్వశాఖతో పాటు సంబంధిత ఇతర అధికారులకు సమర్పించినట్లు ప్రభుత్వ ఉన్నతస్థాయి వర్గాలు వెల్లడించాయి. జూన్ 12న ఈ దుర్ఘటన చోటుచేసుకోగా.. ఆ మరుసటిరోజే ప్రమాదంపై దర్యాప్తునకు ఏఏఐబీ ప్రత్యేక కమిటీని ఏర్పాటు-చేసింది. దీనికి ఏఏఐబీ డైరెక్టర్ జనరల్ జీవీజీ యుగంధర్ నేతృత్వం వహిస్తుండగా.. ఏవియేషన్ మెడిసిన్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ నిపుణులు, అమెరికాకు చెందిన నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు నిపుణులు సభ్యులుగా ఉన్నారు. ప్రమాదానికి గురైన విమానం నుంచి సేకరించిన బ్లాక్‌బాక్స్‌లను ఏఏఐబీ ల్యాబ్‌కు తరలించారు. అందులోని డేటాను విజయవంతంగా డౌన్‌లోడ్ చేసి ప్రమాదానికి గల కారణాలను విశ్లేషిస్తున్నారు.